ప్రజాశక్తి
మంగళవారం 25 నవంబరు, 2025
5
శ్రీకాకుళం

29న స్థాయీ సంఘాల సమావేశాలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఈనెల 29వ తేదీన జిల్లాపరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహించనున్నట్లు జెడ్‌పి సిఇఒ డి.సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. 29వ తేదీన ఉదయం 10.30 గంటల నుంచి జిల్లా పరిషత్ నూతన సమావేశ మందిరంలో 6వ స్థాయీ సంఘ సమావేశం 11.30 గంటల వరకు, 3వ స్థాయీ సంఘ సమావేశం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, 5వ స్థాయీ సంఘ సమావేశం మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 1.30 గంటల వరకు ఉంటుందని వివరించారు. 2, 4, 1, 7వ స్థాయీ సంఘ సమావేశాలు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు ఉంటాయని తెలిపారు.

ఎయిర్‌పోర్టు ఆందోళనలపై ఉలికిపాటు

సమావేశం కాకుండా రైతులకు పోలీసుల కౌన్సెలింగ్

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

మందస కార్గో ఎయిర్‌పోర్టుకు వ్యతిరేకంగా ఆందోళనలు అంటేనే ప్రభుత్వం ఉలిక్కిపడుతోంది. కనీసం రైతులు ఒక చోట చేరి సమావేశమవుదామన్నా అంగీకరించడం లేదు. కార్గో ఎయిర్‌పోర్టుపై మందస మండలం రాంపురంలో రైతులతో ఆర్‌డిఒ జి.వెంకటేష్ సోమవారం నిర్వహించాల్సిన సమావేశం వాయిదా పడింది. ఎయిర్‌పోర్టుపై రైతులతో ఆర్‌డిఒ మాట్లాడతారంటూ రెండు రోజుల కిందట రాంపురం ప్రజలకు అధికారులు సమాచారమిచ్చారు. అంతా సిద్ధమవుతున్న తరుణంలో ఈనెల 23న ఆర్‌డిఒ తుపాను కారణాలు చూపి రాలేనంటూ గ్రామస్తులకు సమాచారమిచ్చారు. అయితే అప్పటికే 20 గ్రామాలకు

ఆర్ఐ చంద్రకళకు తీర్మానం అందజేస్తున్న రాంపురం గ్రామస్తులు

చెందిన ప్రజలు, రైతులకు సమాచారం వెళ్లిపోవడంతో వారంతా రాంపురంలో మండపం ప్రాంతానికి చేరుకున్నారు. రైతులు, ప్రజలు భారీగా తరలివచ్చారన్న సమాచారంతో మందస పోలీసులు అక్కడకు చేరుకున్నారు. సమావేశానికి ఆర్‌డిఒ రావడం లేదని చెప్పిన తర్వాత ఎందుకు సమావేశమవుతున్నారంటూ మందస ఎస్ఐ కృష్ణప్రసాద్ ఎయిర్‌పోర్టు వ్యతిరేక పోరాట కమిటీ నాయకులను ప్రశ్నించారు. ఆందోళనలు చేస్తున్నామా?, ధర్నాలు చేస్తున్నామా? మాట్లాడటానికి మీకేం ఇబ్బంది అని పోలీసులకు వారు బదులిచ్చారు. డిఎస్‌పి మీతో మాట్లాడుతారంటూ కొందరు ముఖ్య నాయకులను ఎస్ఐ వెంటబెట్టుకుని బయలుదేరారు. తీరా చూస్తే పలాస సిఐ తిరుపతిరావు వద్దకు తీసుకువెళ్లారు. మాకు సమాచారం ఇవ్వకుండా సమావేశాలు ఎలా నిర్వహిస్తారని, అనుమతి తీసుకుని సమావేశాలు పెట్టుకోవాలని సిఐ కౌన్సెలింగ్ ఇచ్చినట్లు తెలిసింది.

సెంటు భూమి ఇచ్చేది లేదంటూ తీర్మానం

కార్గో ఎయిర్‌పోర్టు కోసం సెంటు భూమి కూడా ఇచ్చేది లేదంటూ మందస మండలం రాంపురం గ్రామస్తులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. పలాస ఆర్‌డిఒ పేరుతో ఒక లేఖను రాసి గ్రామ రెవెన్యూ అధికారులకు దాన్ని అందించారు. గ్రామంలో ఏ ఒక్కరూ సెంటు భూమి కూడా ఇవ్వరని... ఇకపై ఆర్‌డిఒ గానీ, ఇతర ప్రభుత్వ అధికారులు గానీ తమను ఇబ్బంది పెట్టొద్దని, భూముల పైకి రావద్దని అందులో పేర్కొన్నారు. అదే మండలం బేతాళపురం గ్రామస్తులు ఎయిర్‌పోర్టుకు సెంటు భూమి ఇవ్వబోమని ఏకగ్రీవ తీర్మానం చేశారు. కార్గో ఎయిర్‌పోర్టు ఉద్దానంలో రాకూడదంటూ రాంపురంలో మహిళలు గ్రామ దేవత ఆలయాలను సందర్శించి మొక్కుకున్నారు.

స్మార్ట్ కిచెన్ వ్యవస్థను రద్దు చేయాలి

ప్రజాశక్తి - జలుమూరు

రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ కిచెన్ వ్యవస్థను రద్దు చేసి, ప్రస్తుతం వంట చేస్తున్న కార్మికులనే కొనసాగించాలని మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ఉత్తర డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పటిష్టంగా అమలు చేయాలని, స్మార్ట్ కిచెన్ల ప్రతిపాదనను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మధ్యాహ్న భోజన పథకం కార్మికులు మండలంలోని ఎంఇఒ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలల్లో 20 ఏళ్లుగా విజయవంతంగా నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేటీకరించే ప్రయత్నం రాష్ట్ర ప్రభుత్వం చేస్తోందన్నారు. అందులో భాగంగానే ప్రాథమిక పాఠశాలలు,

ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం వంట కార్మికులు

హైస్కూళ్లలో ప్రస్తుతం నిర్వహిస్తున్న వంట విధానాన్ని రద్దు చేసి, ఒకే చోట స్మార్ట్ కిచెన్ పేరుతో సామూహిక వంటశాల నిర్వహించేందుకు ప్రయత్నాలు చేస్తోందని చెప్పారు. స్మార్ట్ కిచెన్ వ్యవస్థ వల్ల మండలం మొత్తానికి ఒకే దగ్గర వండి పలు పాఠశాలలకు పంపించడం వల్ల వేడి ఆహారం అందదన్నారు. ఇది పథక లక్ష్యానికి పూర్తి విరుద్ధమని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ఇస్కాన్, అక్షయపాత్ర, నాంది ఫౌండేషన్ వంటి సంస్థలకు వంట ఏజెన్సీల్లో విఫలమయ్యాయని తెలిపారు. ఆ ఏజెన్సీలకు ఇచ్చిన చోట విద్యార్థులకు వేడి ఆహారం, సక్రమంగా మెనూ అమలు కావడం లేదన్నారు. మన జిల్లాలోనూ శ్రీకాకుళం, గార, ఆమదాలవలస మండలాల్లో ప్రైవేట్ ఏజెన్సీలకు ఇచ్చి అనేక విమర్శలు ఎదుర్కొంటున్న పరిస్థితి ఉందన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులు సేవా దృక్పథంతో పథకాన్ని నిర్వహిస్తున్నారని, వీరికి కనీస వేతనాలు, పిఎఫ్, ఇఎస్ఐ, గ్రాట్యుటీ, పెన్షన్ వంటివి రాష్ట్ర ప్రభుత్వం చెల్లించకుండా, ఈరకంగా ఉన్న ఉపాధినీ తీసేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించే ఆలోచనలు విరమించుకోకపోతే జిల్లావ్యాప్తంగా వంట కార్మికులు, విద్యార్థులు, తల్లిదండ్రులను ఐక్యం చేసి పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ధర్నా అనంతరం ఎంఇఒలు బి.మాధవరావు, వి.ఆర్.ఎస్ ప్రసాదరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎం.పార్వతి, పి.కన్యాకుమారి, టి.సూరమ్మ, వాన సరస్వతి, ఎన్.కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

అందరి అభిప్రాయాలతో డిసిసి అధ్యక్షుని ఎన్నిక

ఎఐసిసి కార్యదర్శి సూరజ్ సింగ్ ఠాకూర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

పార్టీ శ్రేణులు, నాయకుల అభిప్రాయాలను స్వీకరించి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులని ఎంపిక చేయనున్నట్లు ఎఐసిసి కార్యదర్శి సూరజ్ సింగ్ ఠాకూర్ తెలిపారు. నగరంలోని ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ సిద్ధాంతాలపై నిబద్ధతతో పనిచేసిన నాయకులు, కార్యకర్తలను గుర్తించి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిని నియమించాలని పార్టీ అధిష్టానం భావించిందన్నారు. పార్టీ జెండా మోసే వారితో పాటు కొంతకాలంగా పార్టీ ఆలోచనలను ప్రజల్లోకి తీసుకెళ్లిన వారికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు స్పష్టం

సమావేశంలో మాట్లాడుతున్న సూరజ్ సింగ్ ఠాకూర్

చేశారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవికి ఇప్పటికే పలువురు నుంచి దరఖాస్తులు అందాయన్నారు. ఈనెల 27వ తేదీ వరకు శ్రీకాకుళంలోనే ఉంటూ అన్ని నియోజకవర్గాల్లో పర్యటించి స్థానిక నాయకులతో సమావేశాలు నిర్వహిస్తానని తెలిపారు. ప్రతి నియోజకవర్గం నుంచి అభిప్రాయాలు సేకరించి, వాటిని ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీకి నివేదిస్తానని చెప్పారు. ఇదే విధానాన్ని తెలంగాణ, జార్ఖండ్ తదితర రాష్ట్రాల్లోనూ అమలు చేశామని వివరించారు. కాంగ్రెస్ పార్టీని కష్టకాలంలోనూ నిలబెట్టేందుకు సేవలందించిన కార్యకర్తలు, నిబద్ధత గల నాయకులకు పార్టీ అవకాశమిస్తుందని స్పష్టం చేశారు. అనంతరం సంస్థాగత నిర్మాణ కార్యక్రమం పేరుతో పార్టీ నాయకులు, శ్రేణులతో సమావేశమయ్యారు. సమావేశంలో పిసిసి సభ్యులు ఎల్.రామారావు, పి.శాంతికుమారి, నాయకులు రెల్ల సురేష్, పేడాడ పరమేశ్వరరావు, అంబటి కృష్ణారావు, సనపల అన్నాజీరావు, గోవింద మల్లిబాబు, బస్వా షణ్ముఖరావు, ఎం.చక్రవర్తి రెడ్డి, లఖినేన నారాయణ తదితరులు పాల్గొన్నారు.

'థర్మల్' ర్యాలీకి అనుమతి నిరాకరణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

సరుబుజ్జిలి - బూర్జ మండలాల్లో ప్రతిపాదిత సూపర్ క్రిటికల్ థర్మల్ పవర్ ప్లాంట్ వద్దంటూ చేపట్టనున్న ర్యాలీకి పోలీసులు అనుమతి నిరాకరించారు. ఆదివాసీ బతుకులను నాశనం చేసే థర్మల్ పవర్ ప్లాంట్‌కు వ్యతిరేకంగా మంగళవారం సరుబుజ్జిలి మండలం వెన్నెలవలస నవోదయ స్కూల్ కూడలి నుంచి సరుబుజ్జిలి కూడలి వద్ద ఉన్న అంబేద్కర్ జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించి, అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందించాలని పవర్ ప్లాంట్ వ్యతిరేక పోరాట కమిటీ నిర్ణయించింది. ఇందుకోసం పవర్ ప్లాంట్ ప్రభావిత గ్రామాల్లో కమిటీ నాయకులు విస్తృతంగా ప్రచారం చేశారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా శాంతియుతంగా ర్యాలీ చేసుకుంటామంటూ ఈనెల 19న కమిటీ నాయకులు పోలీసులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేశారు. సరుబుజ్జిలి పోలీసులు తొలుత ర్యాలీకి అంగీకరించి తర్వాత అనుమతి నిరాకరించారు. దీనిపై కమిటీ నాయకులు డిఎస్‌పి వివేకానందను కలిసి సుమారు 500 మందితో ర్యాలీ నిర్వహిస్తామని, తమలో తాము వాలంటీర్లుగా ఉండి ట్రాఫిక్‌కు ఎటువంటి ఇబ్బంది లేకుండా చేస్తామని, ర్యాలీకి అనుమతించాలని విన్నవించారు. ర్యాలీ తర్వాత సరుబుజ్జిలి తహశీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చి ముగించేస్తామని వివరించారు. చివరి క్షణంలో ర్యాలీకి అనుమతి లేదని డిఎస్‌పి వివేకానంద తేల్చిచెప్పడంతో కమిటీ నాయకులు సోమవారం ఎస్‌పి కె.వి మహేశ్వరరెడ్డిని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలిసి వినతిపత్రం అందించారు. ర్యాలీకి అనుమతి ఇవ్వలేమంటూ ఎస్‌పి సైతం నిరాకరించారు. ర్యాలీకి అనుమతుల నిరాకరణ, పోలీసుల నిర్బంధంపై మంగళవారం వెన్నెలవలసలో మీడియా సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. ఎస్‌పిని కలిసిన వారిలో థర్మల్ పవర్ ప్లాంట్ పోరాట కమిటీ అధ్యక్షుడు బి.సురేష్, ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వాబ యోగి, నాయకులు సవర లక్ష్మణ్, ధర్మ, మిన్నారావు తదితరులు ఉన్నారు.

నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు

మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

ఎమ్మెల్యే కూన రవికుమార్

ప్రజాశక్తి - పొందూరు

జాబ్‌మేళాల ద్వారా నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు పియుసి చైర్మన్, ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. స్థానిక సిస్టం కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన సోమవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 16 సంస్థలు పాల్గొన్నాయి. 451 మంది ఇంటర్వ్యూలకు హాజరు కాగా, 242 మంది పలు కంపెనీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో అభ్యర్థులు కంపెనీల చుట్టూ తిరుగుతూ ఉద్యోగాల కోసం నిరీక్షించాల్సి వచ్చేది, ఇప్పుడు నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన కంపెనీలే వచ్చి వారికి కావాల్సిన అభ్యర్థులను ఎంపిక చేసుకుంటున్నాయని చెప్పారు. గత ప్రభుత్వ పాలనలో యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లేక తీవ్రంగా నష్టపోయారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక యువతకు నైపుణ్యాలు పెంపొందించడమే కాకుండా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో పలు పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. దీన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఉరిటి సాయికుమార్, సిస్టం కళాశాల కరస్పాండెంట్ మొదలవలస మోహనరావు, టిడిపి నాయకులు వండాన మురళి, అన్నెపు రాము, గాడు నారాయణరావు, బాడాన శేషగిరినాయుడు, గొర్లె అనంతరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'మీకోసం'కు వినతుల వెల్లువ

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

జిల్లా నలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన పిజిఆర్‌ఎస్ (ఫిర్యాదుల నమోదు సమస్యల పరిష్కార వేదిక)లో అర్జీలు అందజేశారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధ్యక్షతన అధికారులు ఫిర్యాదులను స్వీకరించారు. ఇచ్ఛాపురానికి సీడాప్ మాజీ చైర్మన్, వైసిపి రాష్ట్ర కార్యదర్శి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి బాహుదా నదిపై వంతెన నిర్మాణం వేగవంతం చేయాలని జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌కు వినతిపత్రం అందజేశారు. వంతెన మార్గం లేకపోవడంతో హైవే నుంచి బెల్లుపడ ఇరుకు మార్గంలో వాహనాలు వెళ్తున్నాయని అన్నారు. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఎచ్చెర్ల మండలం బొంతలకోడూరుకు సర్పంచ్ పంచిరెడ్డి రాంబాబు తనకు

వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

రాయ కీయ కక్షతో చెక్ పవర్ రద్దు చేశారని, ఇఒపిఆర్‌డికి ఆరు నెలలు దాటి రద్దు చేసే అధికారం లేదని, ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఇదే గ్రామానికి చెందిన పారిశుధ్య కార్మికులు నెలకు రూ.6 వేలు వేతనం తమకు పంచాయతీ అందజేస్తుందని, సర్పంచ్ చెక్ పవర్ రద్దు వల్ల జనవరి నుంచి వేతనాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. నిరు పేదలమైన తమ బతుకు భారంగా ఉందని ఫిర్యాదు చేశారు. మెళియాపుట్టి మండలం చాపరలో ఎఎన్ఎం లేరని, స్థానికంగా అర్హత ఉన్నవారికి అవకాశం కల్పించాలని స్థానికులు కోరారు. ఎచ్చెర్ల మండలంలోని డి.మత్స్యలేశంలో వైశాఖి హేచరీ ఆర్ఒ ప్లాట్లు నిర్వహణకు రూ.7 వేలు వేతనానికి 2017లో నలుగురిని నియమించిందని, వారిని తొలగించి టిడిపి వారికి ప్రస్తుతం నియమించారని ఎంపిటిసి వలసమ్మ, మాజీ సర్పంచ్, న్యాయవాది శ్రీరాములు ఫిర్యాదు చేశారు. పరిశ్రమ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలన్నారు. మూడేళ్ల నుంచి వృద్ధాప్య పింఛను తనకు రావడం లేదని నరసన్నపేటకు చెందిన మంగమ్మ విన్నవించారు. ఎచ్చెర్ల మండలం అరిణాంఅక్కివలస సర్పంచ్ అంబటి శ్రీనివాసరావు గ్రామ పంచాయతీ పరిధిలో షేషుపేట, పట్టుశాలిపేట, కొత్తపల్లి ప్రాంతాలకు రోడ్డులు నిర్మాణం చేపట్టాలని కోరారు. స్వీకరించిన ఫిర్యాదుల్లో అత్యధికంగా రెవెన్యూశాఖ 41కు సంబంధించినవి కావడం గమనార్హం. ఆ తర్వాతి స్థానాల్లో సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ 16, వ్యవసాయ శాఖ 15, పంచాయతీ రాజ్ 7 శాఖలకు సంబంధించిన సమస్యలు ఉన్నాయి. ల్యాండ్ రికార్డ్స్, విద్యుత్ శాఖ, హౌసింగ్ వంటి శాఖలకు ఐదు చొప్పున ఫిర్యాదులు అందాయి. రూరల్ డెవలప్‌మెంట్, గ్రామ సచివాలయాలు, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, సమగ్ర శిక్ష, సంక్షేమ శాఖలు, ఆరోగ్య శాఖలు, ఏపి స్కిల్ డెవలప్‌మెంట్ వంటి మొత్తం 26 వేర్వేరు శాఖల నుంచి ఈ ఫిర్యాదులు స్వీకరించారు.

అర్జీలపై కలెక్టర్ సమీక్ష

సమస్యల పరిష్కారానికి అధికారు లందరూ సమన్వయంతో పనిచేసి, ప్రజా సమస్యల పరిష్కార వేదిక లక్ష్యాన్ని చేరుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రత్యక్షంగా, ఆన్‌లైన్‌లో మొత్తం 127 ఫిర్యాదులు నమోదయ్యాయని తెలిపారు. ప్రతి ఫిర్యాదునూ వ్యక్తిగత శ్రద్ధతో పరిశీలించి, ప్రజలకు సంతృప్తి కలిగే విధంగా నిర్ణీత గడువులోగా త్వరగా పరిష్కరించేందుకు కృషి చేయాలని ఆదేశించారు. సమస్యల పరిష్కారంలో జాప్యం వహించవద్దని స్పష్టం చేశారు. ఫిర్యాదు చేసిన వారికి స్పష్టమైన సమాచారం ఇవ్వాలని చెప్పారు. సాధ్యమనంత వరకు వేగంగా సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి డిఆర్ఒ గణపతిరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, డిఆర్‌డిఎ పీడీ కిరణ్‌కుమార్, డ్వామా పీడీ పి.సుధాకరరావు పాల్గొన్నారు.

వ్యవసాయంపై ప్రభుత్వ నిర్లక్ష్యం

వైసిపి ఉత్తరాంధ్ర రైతు విభాగం జోనల్ ఇన్‌ఛార్జి రఘురాం

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

వ్యవసాయంపై ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందని వైసిపి ఉత్తరాంధ్ర రైతు విభాగం జోనల్ ఇన్‌ఛార్జి గొండు రఘురాం విమర్శించారు. స్థానిక వైసిపి జిల్లా కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో గతంలో రైతు భరోసా 7.80 లక్షల మందికి అందజేస్తే.. ప్రస్తుతం పిఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకంలో 40 వేల మందిని తగ్గించారని తెలిపారు. నిరుపేదలైన కౌలు రైతులను విస్మరిస్తున్నారని, వారికి గుర్తింపు కార్డులు, ప్రభుత్వ రాయితీలు అందజేయడం లేదని విమర్శించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయకపోవడంతో రైతులు దళారులపై ఆధారపడుతున్నారని తెలిపారు. రైతులకు విత్తనాలు మొదలు మద్దతు ధరకు కొనుగోలు వరకు రైతుభరోసా కేంద్రాల ద్వారానే గత ప్రభుత్వంలో సాగేవని, కూటమి ప్రభుత్వం రైతు సేవా కేంద్రాలుగా పేరు మార్చడంతో పాటు నిర్వీర్యం చేసిందని ధ్వజమెత్తారు. ఈ ఖరీఫ్‌లో ఎరువులు దొరకలేదని, అధిక ధరలకు బ్లాక్ మార్కెట్‌లో

సమావేశంలో మాట్లాడుతున్న రఘురాం

రైతులు కొనుగోలు చేశారని చెప్పారు. పంటలకు మద్దతు ధర లేదన్నారు. మొంథా తుపానుకు వరి, అరటి, బొప్పాయి ఇతర ఉద్యాన పంటల రైతులు నష్టపోయాయని, కనీసం ఎన్యూమరేషన్ చేయలేదని, నష్ట పరిహారం ఇవ్వలేదన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి సొంత జిల్లాలోనే రైతులు దయనీయ పరిస్థితులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వరికి మద్దతు ధర చెల్లించి ప్రతి గింజా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేస్తే ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకుంటుందని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు గొర్లె అప్పలనాయుడు, పి.శ్రీహరి, శిమ్మ ధర్మరాజు, రావాడ జోగినాయుడు తదితరులు పాల్గొన్నారు.

లాభసాటి పంటల వైపు అడుగులు వేయాలి

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - ఎచ్చెర్ల, శ్రీకాకుళం రూరల్

రైతులు లాభసాటి పంటల వైపు అడుగులు వేయాలని, మార్కెట్‌కు అనుగుణంగా పంట మార్పిడిపై దృష్టిసారించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సూచించారు. ఎచ్చెర్ల మండలంలోని పొన్నాడ, శ్రీకాకుళం రూరల్ మండలంలోని కాజీపేటలో రైతన్న మీకోసం వారోత్సవాల్లో భాగంగా రైతులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 29వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా 'రైతన్న- మీకోసం' వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఏడు రోజుల కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, సచివాలయ సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి రైతుల సమాచారం సేకరిస్తారని తెలిపారు. పాత పద్ధతులకు స్వస్తి చెప్పి నూతన, లాభదాయక పంటల సాగుకు రైతులను ప్రోత్సహించడంతో పాటు ఎరువులు, పురుగు మందుల వాడకాన్ని తగ్గించే అంశంపై లోతుగా అవగాహన కల్పిస్తారని చెప్పారు. రైతు సేవా కేంద్రంలోని అగ్రికల్చర్ అసిస్టెంట్‌తో సహా మొత్తం ఆరుగురు సిబ్బంది ఇందులో పాల్గొంటారని తెలిపారు. వీరు 'పంచ సూత్రాల' అమలుపై ప్రత్యేక దష్టి సారిస్తారన్నారు. ప్రకృతి వ్యవసాయ అధికారులనూ భాగస్వామ్యం చేసి, రైతులను ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లించేలా తగిన సూచనలు చేయనున్నట్లు వివరించారు. సిబ్బందికి వారం రోజుల పాటు రైతులు తీరిక చూసుకొని అందుబాటులో ఉండాలని కోరారు. ప్రతిష్టాత్మక కార్యక్రమాన్ని సమన్వయంతో విజయవంతం చేయాలని చెప్పారు. పొన్నాడ వంకాయను మరింత మార్కెటింగ్ చేయాలన్నారు. కలెక్టర్ వెంట ఆయా శాఖల అధికారులు, రైతులు ఉన్నారు.

రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ఎన్‌జిఒ తాలుకా ఎన్నికల షెడ్యూల్ విడుదల

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ తాలుకాల కార్యవర్గాల కాలపరిమితి ఈనెలతో ముగియనున్నందున, కొత్త కార్యవర్గాలకు సంబంధించి నాలుగు విడతల్లో ఎన్నికల నిర్వహణకు షెడ్యూల్‌ను విడుదల చేసినట్లు ఎన్‌జిఒ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హనుమంతు సాయిరాం, చల్లా శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి విడతలో భాగంగా ఇచ్ఛాపురం, సోంపేట, పలాస తాలుకాలకు సంబంధించి నామినేషన్లు ఈనెల 27న స్వీకరించి, డిసెంబర్ 4న ఎన్నికలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. రెండో విడతలో పాతపట్నం, హిరమండలం, కొత్తూరు తాలుకాలకు సంబంధించి నామినేషన్లు ఈనెల 29న స్వీకరించి, ఎన్నికలను డిసెంబర్ 6న నిర్వహిస్తామని తెలిపారు. మూడో విడతలో టెక్కలి, కోటబొమ్మాళి, నరసన్నపేట తాలుకాలకు సంబంధించి డిసెంబర్ 3న నామినేషన్లు స్వీకరించి, 10న ఎన్నికలను నిర్వహిస్తామని పేర్కొన్నారు. నాలుగో విడతలో పొందూరు, ఆమదాలవలస, రణస్థలం తాలుకాలకు డిసెంబర్ 5న నామినేషన్లు స్వీకరించి, 12న ఎన్నికలు నిర్వహిస్తామని వెల్లడించారు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు ఎన్‌జిఒ హోంలో నోటీసు బోర్డులో, అన్ని తాలుకా ఆఫీసు కేంద్రాల్లో అందుబాటులో ఉంచామని తెలిపారు. ఈ ఎన్నికల్లో అన్ని విభాగాల ఉద్యోగులు కూడా పెద్దఎత్తున పాల్గొని కార్యవర్గాల ఎన్నికను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

సినీ నటి రితికా నాయక్

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

భవిష్యత్‌ను నాశనం చేసే మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని సినీ నటి రితికా నాయక్ అన్నారు. నగరంలోని పద్మం సిల్వర్ జ్యూయలరీ ప్రారంభానికి సోమవారం జిల్లాకు వచ్చిన ఆమె శ్రీకాకుళం రెండో పట్టణ పోలీసుల ఆధ్వర్యంలో డ్రగ్స్ వద్దు బ్రో, శక్తి యాప్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుటుంబం, సమాజం, రాష్ట్రాభివృద్ధి కోసం ప్రతిఒక్కరూ డ్రగ్స్‌ను పూర్తిగా నిరాకరించాలని పిలుపునిచ్చారు. జిల్లాలో మాదక ద్రవ్యాల నిర్మూలన దిశగా పోలీసులు మరింత

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సినీ నటి రితికా నాయక్

కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. శక్తి యాప్ ద్వారా పోలీసు శాఖ అందిస్తున్న సేవలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రెండో పట్టణ సిఐ ఈశ్వరరావు, ఎస్ఐ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

IN THE HONOURABLE COURT OF THE FAMILY COURT JUDGE AT SRIKAKULAM
G.O.P: 7/2025

Between :-
Mula Jagadeeswara rao ......Petitioner
And :-
Mula Eswaramma @ Annepu Sandhya ......Respondent

To,
Mula Eswaramma @ Annepu Sandhya, W/o Jagadeeswara rao, aged about 27 years, Household duties, Residing at Polavaram village, Tekkali Mandal Srikakulam District.

పై నంబర్ గల పిటిషన్‌లో మీరు రెస్పాండెంట్ అయి ఉన్నారు. పై కోర్టు వారు మీకు నోటీసు నిమిత్తము **తేదీ 11.12. 2025 వాయిదా అయి ఉన్నది.** సదరు పైన తెలిపిన **తేదీన ఉదయం 10:30** నిమిషములకు కోర్టు వారి ఎదుట స్వయంగా గాని వకీల్ ద్వారా గాని హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను, అట్లు లేనియెడల శ్రీ కోర్టు వారు మీ పరోక్షమున విచారించి తీర్మానించడం అగునని ఈ నోటీసు మూలంగా తెలియజేయడమైనది.

//శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు మేరకు//

L. LAKSHMI
G. MALLESWARA RAO
ADVOCATES,
SRIKAKULAM, CELL 9948845204.

DOCUMENT MISSING

NEYYILA KARISHMA, W/o NEYYILA SANKAR RAO R/o Hanuman Junction, Baruva Village, Post, Sompeta Mandalam, Srikakulam District, AP.

My Document Registration Number 2488/2025 and that above said sale Document from the Link Document bearing Registration Number 3470/2022 that the Original LINK DOCUMENT No.3470/2022 has been lost by use on 10-11-2025 while I was traveling on bike from my house to Baruva Main Road for taking Xerox Copies and inspite of my best efforts we are unable to track it and it is lost beyond recovery. That we are in need for a Duplicate LINK DOCUMENT No.3470/2022 for which purpose I'm here by making this declaration as required by the Concerned Authorities.

అర్జీదారుల నుంచి సమస్యలు తెలుసుకుంటున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

ఫిర్యాదులు పూర్తిస్థాయిలో పరిష్కరించాలి

ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ప్రజా ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కారం కార్యక్రమంలో (పబ్లిక్ గ్రీవెన్స్)లో స్వీకరించే ఫిర్యాదులపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి అర్జీదారుల సంతృప్తి పొందేలా పరిష్కరించాలని ఎస్‌పి కె.వి. మహేశ్వర రెడ్డి క్షేత్రస్థాయి అధికారులను సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదికలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ప్రజల నుంచి 52 అర్జీలు సేకరించారు. వారితో ముఖాముఖి మాట్లాడి, ఫిర్యాదుదారుల సమస్యలను తెలుసుకొని పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. ఫిర్యాదుదారుల అర్జీలు, వారి వివరాలు సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ కాల్ (జూమ్ కాన్ఫరెన్స్) ద్వారా తక్షణమే సంబంధిత పోలీసు అధికారులకు తెలియజేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ఆయా ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను నిర్ణీత సమయంలో జిల్లా పోలీసు కార్యాలయానికి నివేదిక రూపంలో పంపించాలని ఆదేశించారు.

మాట్లాడుతున్న సినీ నటి రితికా నాయక్

పద్మం సిల్వర్ జ్యూయలరీ షోరూం ప్రారంభం

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశాలో పలు బ్రాంచ్‌లను నిర్వహిస్తున్న సిఎంఆర్ ఆధ్వర్యాన పద్మం సిల్వర్ జ్యూయలరీ షోరూంను నగరంలోని జి.టి రోడ్డులో సినీ నటి రితికా నాయక్ సోమవారం ప్రారంభించారు. షోరూంలోని ఆభరణాలను పరిశీలించిన అనంతరం ఆమె మాట్లాడుతూ పద్మంలో సిల్వర్, బంగారు ఆభరణాలు చాలా బాగున్నాయన్నారు. పలు వెరైటీలు ఇక్కడి ప్రజలను ఆకట్టుకుంటాయని చెప్పారు. సిఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ మాట్లాడుతూ ప్రస్తుతం గోల్డ్, సిల్వర్ జ్యూయలరీకి మంచి డిమాండ్ ఉందన్నారు. పద్మం షోరూంలో అతి తక్కువ ధరలకే సిల్వర్ జ్యూయలరీ ఇస్తున్నామన్నారు. షోరూం ప్రారంభం సందర్భంగా పలు ఆఫర్లు ఇస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. అనంతరం సినిమా పాటలకు స్టెప్పులు వేసి సినీనటి రితికా నాయక్ సందడి చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే శంకర్ సతీమణి స్వాతి, టిడిపి నాయకులు పాండ్రంకి శంకర్, అంధవరపు ప్రసాద్, సిఎంఆర్ మీడియా ఇన్‌ఛార్జి వరకుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న విఆర్‌ఎలు

కనీస వేతనం చెల్లించాలి

పలాస: గ్రామ రెవెన్యూ సహాయకులకు కనీస వేతనం చెల్లించాలని విఆర్‌ఎ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. పలాస రెవెన్యూ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా చేపట్టారు. అనంతరం ఆర్‌డిఒ జి.వెంకటేష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హత ఉన్న విఆర్‌ఎలను విఆర్‌ఒగా, రికార్డు అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతులు కల్పించాలన్నారు. అక్రమ డ్యూటీలను రద్దు చేయాలన్నారు. రీసర్వే పేరుతో ఇతర గ్రామాల్లో విధులను రద్దు చేయాలన్నారు. రెవెన్యూ శాఖలో ఖాళీగా ఉన్న విఆర్‌ఒ, రికార్డు అసిస్టెంట్లు, అటెండర్, నైట్ వాచ్మెన్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లక్ష్మణరావు, తిరుపతిరావు, సింహాచలం పాల్గొన్నారు.

అధ్యక్ష పదవికి దరఖాస్తు చేస్తున్న కిరణ్ కుమార్

డిసిసి అధ్యక్ష బరిలో కిరణ్ కుమార్

కవిటి: డిసిసి అధ్యక్షుడి నియామక ప్రక్రియలో భాగంగా ఎఐసిసి, ఎపిసిసి సూచనల మేరకు నిర్వహిస్తున్న 'సంఘటన్ సృజన్ అభియాన్' కార్యక్రమం సోమవారం ఉత్సాహంగా సాగింది. శ్రీకాకుళం ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎఐసిసి అబ్జర్వర్, కార్యదర్శి సూరజ్ సింగ్ ఠాకూర్, ఎపిసిసి అబ్జర్వర్లు ఆంధ్రప్రదేశ్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు లక్కరాజు రామారావు, పిసిసి ప్రధాన కార్యదర్శి శాంతకుమారి హాజరయ్యారు. వారిని మీడియా సమక్షంలో కలిసిన ప్రస్తుత జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు డాక్టర్ పూడి కిరణ్ కుమార్, డిసిసి అధ్యక్ష పదవికి సంబంధించిన నియామక దరఖాస్తును అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డిసిసి అధ్యక్ష బాధ్యతలు తనకు అప్పగిస్తే పార్టీ కార్యాచరణను గ్రామం నుంచి జిల్లా స్థాయికి విస్తరింపజేసి, ఐక్యతతో బలోపేతం చేస్తానని తెలిపారు. 2029లో రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా చూడాలనే లక్ష్యంతో పనిచేస్తానని అన్నారు.

విద్యార్థులను ప్రోత్సహించాలి

రణస్థలం రూరల్ : హిందీ సేవాసదన్ అనంతపురం ఆధ్వర్యంలో రెండు తెలుగు రాష్ట్రాల్లో సిబిఎస్‌సి, రాష్ట్ర ప్రభుత్వ హిందీ సిలబస్‌పై 6 నుంచి 12 తరగతుల విద్యార్థులకు హిందీ ప్రతిభా పరీక్షను నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల హిందీ ఉపాధ్యాయులు విద్యార్థులను హిందీ టాలెంట్ టెస్ట్‌లో పాల్గొనే విధంగా ప్రోత్సహించాలని హిందీ మంచ్ సంస్థ జిల్లాశాఖ ప్రధాన కార్యదర్శి రొంపివలస రామారావు, జోనల్ సెక్రటరీ కోనే శ్రీధర్ ఒక ప్రకటనలో కోరారు. పరీక్ష ఆయా తరగతుల హిందీ పాఠ్యపుస్తకంపై 100 బహుళ ఐచ్ఛిక ప్రశ్నలకు 100 మార్కుల రూపంలో ఉంటుందని తెలిపారు. పాఠశాల స్థాయి పరీక్ష డిసెంబర్ 8న, జిల్లాస్థాయి పరీక్ష జనవరి 4న ఉంటుందన్నారు.

ఐతమ్ ఎంబిఎకు ఎన్‌బిఎ టైర్-1 గుర్తింపు

టెక్కలి రూరల్ : టెక్కలి ఐతమ్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న ఎంబిఎ కోర్సుకు నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రెడిటేషన్ (ఎన్‌బిఎ) టైర్-1 గుర్తింపు లభించిందని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి. నాగేశ్వరావు తెలిపారు. సోమవారం మాట్లాడుతూ రాష్ట్రంలో రెండు విశ్వవిద్యాలయాలతో పాటు ఈ అరుదైన గుర్తింపు పొందిన ఏకైక విద్యా సంస్థగా ఐతమ్ కళాశాల అవతరించిందని తెలిపారు. దేశవ్యాప్తంగా ప్రమాణాలు, నాణ్యత, పారదర్శకత కలిగిన మేనేజ్‌మెంట్ విద్యా సంస్థలకు మాత్రమే లభించే ఈ గుర్తింపు ఆంధ్రాలో ఐతమ్ కళాశాలకు మాత్రమే ప్రత్యేకంగా లభించిందన్నారు. ట్రెజరర్ టి.నాగరాజు మాట్లాడుతూ ఈ గుర్తింపు వల్ల ఐతం ఎంబిఎ విద్యార్థులకు జాతీయ, అంతర్జాతీయ ఉద్యోగ అవకాశాలు, ఉన్నత విద్యలో ప్రత్యేక గుర్తింపు, పరిశ్రమల్లో విశ్వసనీయత లభిస్తుందన్నారు

దళారీ వ్యవస్థ నిర్మూలనే లక్ష్యం

నందిగాం : ప్రారంభిస్తున్న అజయ్ కుమార్

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

రైతు ధాన్యం కొనుగోలులో అక్రమాలకు పాల్పడే దళారీ వ్యవస్థను పూర్తిగా నిర్మూలించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం స్వయంశక్తి సంఘ మహిళల సహజ ఉత్పత్తుల శిక్షణా కేంద్రాన్ని ప్రారంభించారు. అంతకుముందు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసినప్పుడు నిర్ణీత బరువు కంటే ఒక్క గింజ ఎక్కువగా అక్రమ తూకం వేసినా సహించేది లేదన్నారు. అటువంటి కొనుగోలు కేంద్రాలు, మిల్లర్లపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. గత వైసిపి హయాంలో ఖరీఫ్ రైతులు ఎన్నో కష్టాలు ఎదుర్కొన్నారని, ధాన్యం విక్రయించినప్పటికీ నెలల తరబడి రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ కాక ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వ హయాంలో పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో రైతుసేవా కేంద్రాలు, పిఎసిఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ధాన్యం విక్రయించిన 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమయ్యే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. డ్వాక్రా సంఘాల మహిళల ఆర్థిక స్వావలంబన కోసం సిఎం చంద్రబాబు పలు రకాల పథకాలను అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పిడి కిరణ్ కుమార్, జిల్లా నాబార్డ్ అభివృద్ధి అధికారి రమేష్ కృష్ణ, డిసిఎంఎస్ చైర్మన్ శిమ్మా సూర్య నారాయణ, తహశీల్దార్ ఎల్. మధుసూదన్, ఎంపిడిఒ ఎం.పావని, ఎఒ మన్మధరావు, ఎపిఎం గోవిందరావు, టిడిపి మండల నాయకులు పల్లి సురేష్, జనసేన మండల అధ్యక్షుడు, పిఎసిఎస్ డైరెక్టర్ పైడి మురళీమోహన్, టిడిపి నాయకులు యండ రామారావు, సింహాచలం, కె.రవికుమార్ పాల్గొన్నారు.

పొందూరు: రైతు సంక్షేమమే సిఎం చంద్రబాబు ధ్యేయమని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. మండలంలోని రాపాకలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళారీ వ్యవస్థను పూర్తిగా రూపుమాపేందుకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను విధిగా

మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎడి శ్రీనివాసరావు, పిఎసిఎస్ చైర్మన్ వండాన మురళీ, తహశీల్దార్ వెంకటేష్, ఎంపిడిఒ వాసుదేవరావు, ఎఒ శ్రీనివాస్ బాబు, తెలుగు యువత మండల అధ్యక్షుడు ఖండాపు శ్రీనివాసరావు, బుజ్జి, కొంచాడ అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

నందిగాం: మండలంలోని పిఎసిఎస్ దిమిలాడ వద్ద వద్ద పిఎసిఎస్ అధ్యక్షులు జి. అజయ్ కుమార్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి రైతు సేవా కేంద్రాలు, వ్యవసాయ పరపతి సంఘం వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. నేరుగా రైతు సేవా కేంద్రాల వద్ద ధాన్యం అమ్మకాలు చేపడితే ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర లభిస్తుందని అన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ సోమేశ్వరరావు, ఎఒ పి.శ్రీకాంత్‌వర్మ, పిఎసిఎస్ సిఇఒ పి.శ్రీనిబాబు, తెంబూరు పిఎసిఎస్ అధ్యక్షులు పోలాకి చంద్రశేఖరరావు, టిడిపి నాయకులు బాలకృష్ణ, దామోదరరావు, మాదిరి లోకనాథం పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న దళితులు

పట్టాలు మంజూరు చేయాలి

ప్రజాశక్తి- కొత్తూరు

మండలంలోని కడుంలో దళితులు సాగులో ఉన్న భూములకు సర్వే చేసి హద్దులు చూపించి పట్టాలు మంజూరు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సిర్ల ప్రసాద్, బారిక సంజీవరావు, జగన్నాథం డిమాండ్ చేశారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద దళితులు ధర్నా చేశారు. అనంతరం డిటి మురళీకృష్ణను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితుల సాగులో ఉన్న వారందరినీ తక్షణమే సర్వే చేపట్టి పట్టాలు మంజూరు చేయాలన్నారు. డిటి మాట్లాడుతూ ఉన్నత అధికారులతో మాట్లాడి రీ సర్వే చేసి దళితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కుప్ప అప్పారావు, దిండి, కృష్ణమూర్తి, కె.ఆదెమ్మ, కె.కాకమ్మ పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలకు గీతిక ఎంపిక

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

గీతిక

కర్నూలులో ఈనెల 21 నుంచి 23 వరకు నిర్వహించిన అండర్-17 కబడ్డీ పోటీలో జిల్లా జట్టు ద్వితీయ స్థానాన్ని సాధించింది. ఇందులో కీలక పాత్ర వహించిన ఎన్.గీతికకు ఆంధ్రప్రదేశ్ బాలికల జాతీయ కబడ్డీ జట్టులో స్థానం లభించింది. ఈమె ఈనెల 24 నుంచి 28 వరకు మహారాష్ట్రంలోని కోకంతాన్‌లో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటుందని నిర్వాహకులు తెలియజేశారు. గీతిక ప్రతిభకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.గోవింద రావు, వ్యాయామ ఉపాధ్యాయులు సిహెచ్. వాసుదేవ రావు, గణేష్, ఉపాధ్యాయ సిబ్బంది, పాఠశాల ఎస్‌ఎంసి చైర్మన్ బోయిన వెంకటరమణలు అభినంద నలు తెలియజేశారు.

ఉన్నత వ్యక్తిత్వం అలవర్చుకోవాలి

ప్రజాశక్తి- సోంపేట

అవగాహన కల్పిస్తున్న గణపతి

విద్యార్థి దశ నుంచే ఉన్నతమైన వ్యక్తిత్వం అలవాటు చేసుకుంటే ఉజ్వల భవిష్యత్‌కు సోపానమవుతుందని ప్రముఖ మనో వికాస నిపుణులు రాంబుడ్డి గణపతి హితవుపలికారు. మండలంలోని పాలవలస ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ఎం.నర్సింహులు అధ్యక్షతన పదో తరగతి విద్యార్థులకు సోమవారం మనోవికాస తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు స్వీయ నియంత్రణ, సమయ పాలన, అభ్యసన నిత్యసాధనపై దృష్టి సారిస్తే రానున్న పరీక్షల్లో సునాయాసంగా విజయం సాధించవచ్చన్నారు. ఆహారం, ఆరోగ్యం, నిద్రపై నిర్లక్ష్యం తగదన్నారు. అధ్యాపకులు, తల్లిదండ్రులు, సర్పంచ్ ప్రతినిధి శంకరరావు పాల్గొన్నారు.

అభినందిస్తున్న ఉపాధ్యాయులు

చెకుముకి విజేతలకు అభినందనలు

కవిటి: ఇటీవల శ్రీకాకుళం బాలికోన్నత పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యాన నిర్వహించిన జిల్లాస్థాయి చెకుముకి సైన్స్ సంబరాల పోటీల్లో కవిటి మండలం మాణిక్యపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు తమ ప్రతిభను చాటుకున్నారు. మొత్తం 85 టీమ్‌లు పాల్గొన్న ఈ సైన్స్ పోటీల్లో మాణిక్యపురం టీమ్‌కు చెందిన సాయికుమార్ బెహరా, సంతోష్ సాహు, హర్షవరదన్ సాహు బృందం 4వ బహుమతిని కైవసం చేసుకుంది. ఈ విజయంపై హెచ్‌ఎం మజ్జి వైకుంఠరావు విద్యార్థులను అభినందిస్తూ ఇది పాఠశాలకు గర్వకారణమని తెలిపారు. అనంతరం ఏర్పాటు చేసిన అభినందన సభలో సైన్స్ ఉపాధ్యాయులైన జి.తిరుపతిరావు, పి.వేణుగోపాల్, ఎన్.రవి, లక్ష్మీబాల నాయక్, దున్న రవికుమార్, ఆర్.శైలజల సేవలను ప్రత్యేకంగా ప్రశంసించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొని విజేతలకు శుభాకాంక్షలు తెలియజేశారు.

కేక్ కట్ చేస్తున్న గణపతిరావు

ఘనంగా సాయిగణేష్ జన్మదిన వేడుకలు

మెళియాపుట్టి: మండలంలోని మర్రిపాడు-సిలో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తనయుడు, టిడిపి యువ నాయకులు డాక్టర్ మామిడి సాయిగణేష్ జన్మదిన వేడుకలు సోమవారం నిర్వహించారు. టిడిపి మండల ఉపాధ్యక్షులు రవ్వల గణపతిరావు ఆధ్వర్యాన వినాయక ఆలయంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, టిడిపి నాయకులు సాయిగణేష్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ... కేక్ కట్ చేశారు. సాయిగణేష్ చేస్తున్న సేవలను పలువురు నాయకులు ఈ సందర్భంగా ప్రస్తావించారు. అలాగే స్వీట్లు, మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ రవ్వల అనురాధ, దుర్గారావు, శంకర్, అప్పారావు పాల్గొన్నారు.

శ్రీనివాసరావు చేతివాటం

రణస్థలం: మండల కేంద్రంలో ఉన్న ఎస్‌బిఐ పాయింట్ ప్రతినిధి గొర్లె శ్రీనివాసరావు చేతివాటం ప్రదర్శించారు. కొందరి ఖాతాదారుల అకౌంటు నుంచి ఆధార్ కార్డ్ ద్వారా డబ్బులు విత్‌డ్రా చేసేటప్పుడు ఎక్కువ డబ్బులు విత్‌డ్రా చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. అందులో భాగంగా మండలంలోని కృష్ణాపురం గ్రామానికి చెందిన మహంతి సత్యంకు ఆంధ్రా బ్యాంకులో ఖాతా ఉంది. అకౌంట్ నెంబర్ 049510100158100 అకౌంటు నుంచి అన్నదాత సుఖీభవ డబ్బులు రూ.7 వేలు తీయమంటే రూ.7,500 విత్ డ్రా చేసి రూ.7 వేలు మాత్రమే చేతికి ఇచ్చి రూ.500 తీసుకున్నారని ఒక ప్రకటనలో ఆరోపించారు. ఇంటికి వెళ్లి ఖాతా పుస్తకం చూసినప్పుడు రూ.500 ఎక్కువ ఎందుకు తీసావని, బ్యాంకు అధికా రులకు ఫిర్యాదు చేస్తామని బెదిరిస్తే రూ.500 తిరిగి తన అకౌంట్‌లో జమచేశారని పేర్కొన్నారు. ఇలాగే చాలా మంది అమయకుల ఖాతానుంచి డబ్బులు విత్‌డ్రా చేస్తున్నట్లు ఆరోపించారు. ఈవిషయంపై రణస్థలం స్టేట్‌బ్యాంకు మేనేజర్‌కు సోమవారం ఫిర్యాదు చేసినట్టు తెలిపారు.

కుల ధ్రువీకరణ పత్రం మంజూరు చేయాలి

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో సుమారు 400 మంది ఒడ్డి తరగతులు ఉన్నారని, వారికి తరగతి ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని సంఘ అధ్యక్షులు బృందావన్ పండిత్ కోరారు. తరగతి ధ్రువీకరణ పత్రం మంజూరు చేయాలని కోరుతూ కవిటి మండలం రామయ్యపుట్టిగలోని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ఇతర నియోజక వర్గాల్లో ఒడ్డికు బిసి-ఎ తరగతి ధ్రువపత్రాలు ఇస్తున్నా రన్నారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి వంశీ పండిత్, ఉపాధ్యక్షులు శివప్రసాద్ పండిత్, అంగన్వాడీ యూనియన్ అధ్యక్షులు బి.హైమావతి, టిడిపి ఆరోవార్డు ఇన్‌ఛార్జి ధర్మరాజు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న ఒడ్డీలు

తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్యసేవలు

ప్రజాశక్తి - రణస్థలం

తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్యసేవలు అందిస్తానని, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే వైద్యునిగా తన మొదటి బాధ్యతని ప్రముఖ గైనిక్ వైద్యనిపుణులు డాక్టర్ దానేటి శ్రీధర్ అన్నారు. మండలం రణస్థలంలో డాక్టర్ శ్రీధర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో స్త్రీల వ్యాధులపై అవగాహన కల్పిస్తూ ఉచిత వైద్యశిబిరం సోమవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ ఇప్పటికే అనేక గ్రామాల్లో మహిళలకు తమకు సంక్రమించే వ్యాధులపై అవగాహన లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. మహిళలు ఆరోగ్య సమస్యలపై ఓపెన్‌గా మాట్లాడేందుకే ఈ అవగాహన కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. మహిళలకు ఎటువంటి గైనిక్ సమస్యలున్నా, సంతాన సమస్యలున్నా తమ ఆస్పత్రిని సంప్రదిస్తే అతితక్కువ ఖర్చుతో వారికి మెరుగైన వైద్యసేవలు అందిస్తానన్నారు. శ్రీకాకుళం

వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ శ్రీధర్

జిల్లాలోనే కాకుండా విజయనగరం, విశాఖపట్నం, ఒడిశా ప్రాంతాల నుంచి కూడా ఎందరో మహిళలు వచ్చి వైద్యసేవలు పొందుతున్నారన్నారు. జిల్లాలో తొలిసారిగా ఐవిఎఫ్‌ను ప్రారంభించింది తమ ఆస్పత్రిలోనేనని చెప్పారు. తమ గ్రామ సర్పంచ్‌లతో కలిసి వచ్చిన వారికి పూర్తిగా వైద్యఖర్చులు తగ్గించి వైద్యసేవలు అందజేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్, జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు పిన్నింటి వెంకట బానోజీనాయుడు, ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

కట్టుకున్న భర్తే కడతేర్చాడు

డిఎస్‌పి లక్ష్మణరావు

బాలకృష్ణను అరెస్టు చేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

నౌపడ గ్రామ శివారులో ఇటీవల దాసరి పుష్పలతను ఆమె భర్తే హత్య చేశాడని టెక్కలి డిఎస్‌పి డి.లక్ష్మణరావు తెలిపారు. ఈ మేరకు నౌపడ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం విలేకరులతో మాట్లాడారు. టెక్కలి మండలం శాసనం పంచాయతీ కొండభీంపురానికి దాసరి బాలకృష్ణ నందిగాం మండలం శివరాంపురానికి చెందిన పుష్పలతతో 14 ఏళ్ల క్రితం వివాహమైందన్నారు. వీరికి ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారని తెలిపారు. భార్యాభర్తలిద్దరూ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవారని పేర్కొన్నారు. అయితే బాలకృష్ణ మూడేళ్ల నుంచి చెడు వ్యసనాలకు బానిసై తరచు భార్యతో గొడవ పడుతుండేవాడని అన్నారు. ఈ విషయమై పలుమార్లు పెద్ద మనుషుల సమక్షంలో తగాదాలు చేపట్టారని అన్నారు. పెద్ద మనుషుల వద్ద తన పరువు పోయిందని బాలకృష్ణ భార్యపై కక్ష పెంచుకుని తరచూ వేధించేవాడని అన్నారు. ఈ క్రమంలో మృతురాలు పుష్పలత కన్నవారి ఇంటి వెళ్లిపోయిందన్నారు. అక్కడి నుంచి నందిగాంలో అద్దె ఇంట్లో ఉంటూ జీవనం చేస్తుండేదని అన్నారు. ఇంతలో భరణం కోసం భర్తపై కోర్టులో కేసు కూడా వేసిందన్నారు. దీంతో బాలకృష్ణ భార్యపై మరింత కక్ష్య పెంచుకున్నట్లు వెల్లడించారు. భార్యను ఎలాగైనా కడతేర్చాలని ప్రణాళిక వేసుకున్నాడని అన్నారు. గురువారం పిల్లల విషయమై మాట్లాడాలని చెప్పి మృతురాలిని నమ్మించి తన బైక్‌పై నౌపడ మూడు రోడ్ల కూడలి వద్ద ఉన్న కబీరి ఫారం వద్ద ఎవరూ లేనిచోటకు తీసుకెళ్లాడని తెలిపారు. అక్కడ మాట్లాడుతున్నట్లు నటించి తనతో పాటు తీసుకెళ్లిన ఎదురు కర్రతో ఆమె తలపై, ముఖంపై బలంగా కొట్టి హత్య చేశారని అనానరు. అనంతరం మృతదేహాన్ని అక్కడే వదిలి బండిపై పారిపోయాడని అన్నారు. నౌపడ విఆర్‌ఒ ఇచ్చిన సమాచారం మేరకు గుర్తు తెలియని మృతదేహాన్ని గుర్తించామన్నారు. దర్యాప్తు అనంతరం బాలకృష్ణను విచారించగా, అసలు నిజయం వెల్లడించారని తెలిపారు. ఆయనను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. సమావేశంలో టెక్కలి రూరల్ సిఐ కె.శ్రీనివాసరావు, నౌపడ ఎస్ఐ నారాయణస్వామిని, పోలీసు సిబ్బంది చైతన్య, ఊర్వారావు, జి.వి.రమణ పాల్గొన్నారు. త్వరితగతిన కేసును ఛేదించిన పోలీసులను అభినందించారు.

చీపురుపల్లి నిర్వాసితుల సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి- మెళియాపుట్టి

పాతపట్నం నియోజకవర్గానికి చెందిన ఎమ్మెల్యే మామిడి గోవిందరావు చొరవతో చీపురుపల్లి నిర్వాసిత రైతుల సమస్యకు పరిష్కారం లభించిందని పిఎసిఎస్ అధ్యక్షులు సలాన మోహనరావు అన్నారు. ఈ మేరకు సోమవారం పిఎసిఎస్ కార్యాలయంలో ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలుపుతూ సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే చొరవతో కలెక్టర్ ప్రత్యేక నిధుల నుంచి రూ.45 లక్షలు మంజూరు కావడంతో రైతులు ఊరట లభించిందన్నారు. గత ఎన్నో ఏళ్లుగా డిపట్టా ప్రాంత రైతులు అన్యాయం ఎదుర్కొంటూ వస్తున్నారని అన్నారు. ఈ సమస్యను ఇటీవల ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగానే వెంటనే స్పందించి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరుకు కృషి చేశారని అన్నారు. సమావేశంలో టిడిపి మండల అధ్యక్షులు నంబాల వెంకటరావు, ఎఎంసి

సమావేశంలో మాట్లాడుతున్న మోహనరావు

చైర్మన్ ప్రతినిధి బైరిసింగ్ దినకర్, మండల తెలుగు యువత అధ్యక్షులు బసవ పరమేశ్వరరెడ్డి, ఎంపిటిసి ప్రతినిధి కదంబల పైడిరాజు, ఇప్పిలి కృష్ణారావు, ఎస్.వినోద్, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు సయ్యద్ సిలార్ పాల్గొన్నారు.

రైతులకు అండగా 'రైతన్న మీకోసం'

పోలాకి : ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

ప్రజాశక్తి- పోలాకి

కూటమి ప్రభుత్వం రైతుల పక్షపాతి అని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మండలంలోని చల్లబంద కుసుమ పోలవలస గ్రామాల్లో రైతన్న మీకోసం కార్యక్రమానికి ప్రారంభించారు. గ్రామంలో రైతుల ఇంటింటికీ వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, టిడిపి మండల అధ్యక్షులు మిరియాపల్లి వెంకటప్పలనాయుడు, పిఎసిఎస్ చైర్మన్ భైరి భాస్కరరావు, తర్ర లక్ష్మీనారాయణ, చిట్టి సింహాచలం, తహశీల్దార్ శ్రీనివాసరావు, ఎంపిడిఒ జి.రవి కుమార్, ఎడి ఎల్.వి.మధు, ఎఒ చిరంజీవి పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : మండలంలోని ఇన్నీసుపేటలో ఎఒ అజయ్‌కుమార్ రైతన్న మీకోసం కార్యక్రమం నిర్వహించి రైతులకు రబీ, ఖరీఫ్ సీజన్లకు సమగ్ర కార్యాచరణ ప్రణాళికలపై అవగాహన కల్పించారు.

పలాస : రైతులకు అండగా రైతన్న నేస్తమని ఆర్‌డిఒ వెంకటేష్ అన్నారు. మండలంలోని లొద్దభద్రలో నిర్వహించిన రైతన్న మీకోసం కార్యక్రమంలో పాల్గొనారు. రైతు ఇంటి వెళ్లి రైతన్న నేస్తంపై అవగాహన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, ఎఎంసి చైర్మన్ మల్లా శ్రీనివాసరావు, పిఎసిఎస్ వంకల కూర్మరావు, పలాస వ్యవసాయ శాఖ ఎడిఎ ఎం.రామారావు, ఎఒ పోలారావు, తహశీల్దార్ కళ్యాణచక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

సోంపేట: మండలంలోని తాళభద్రలో వ్యవసాయశాఖ ఎడి టి.భవానీశంకర్ ఆధ్వర్యాన రైతన్న మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి రైతులకు వచ్చే రబీ, ఖరీఫ్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎఒ నరసింహమూర్తి, తాళభద్రలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు బిన్నల జగన్నాథరావు పాల్గొన్నారు. అలాగే బారువ, సుంకిడి గ్రామాల్లో ఎఒ ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి సందేశం అందిస్తూ పోస్టర్లను అందజేశారు.

మందస : మండలంలోని లోహరిబంద, బాలిగాం పంచాయతీల్లో నిర్వహించిన రైతన్న మీకోసం కార్యక్రమాల్లో టిడిపి మండల అధ్యక్షులు బద్రి కోదండరావు, అందాల రామారావు, జోగ జానకిరావు, రాపాక భువనేష్, ఊళ్ల శంకర్, కోరాడ మోహనరావు, ముడిమించి రామస్వామి, గొరకల భాస్కరరావు, తలగాన కృష్ణారావు పాల్గొన్నారు.

మెళియాపుట్టి: మండలంలోని చాపరలో ఎఒ దానకర్ణుడు రైతన్న మీకోసం కార్యక్రమంలో భాగంగా రైతుల ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ సలాన మోహనరావు, మార్కెట్ కమిటీ ప్రతినిధి బి.దినకర్, ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా, డిటి రాము, టిడిపి మండల అధ్యక్షులు నంబాల వెంకట రావు, పడాల శ్రీనునాయకులు, పోలినాయుడు, శంకరరావు పాల్గొన్నారు.

కొత్తూరు : కొత్తూరులోని రైతన్న మీకోసం కార్యక్రమంలో నీటి సంఘం ఉపాధ్యక్షులు లోతుగెడ్డ ఆనందరావు ఆధ్వర్యాన రైతులకు అవగాహన కల్పించారు. నీటి భద్రత డిమాండ్, ఆధారిత పంటలు, అగ్రిటెక్ ఫుడ్ ప్రాసెసింగ్, పాడి పరిశ్రమ పలు అంశాలపై రైతులకు సలహాలు అందించారు. కార్యక్రమంలో ఎఒ స్వర్ణలత, ఎఇఒ బి.రమేష్, మాధవరావు, విఎఎ శ్రీలక్ష్మి, వెటర్నరీ అసిస్టెంట్ సంతోష్‌కుమారి, ఫిషరీస్ అసిస్టెంట్ సుదర్శనరావు, ఎపిసి ఎంఎఫ్ సుభాషిని, రమణమ్మ, మాధవి పాల్గొన్నారు.

ఆమదాలవలస: రైతుల కోసం ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని కొర్లకోట, కొరపాం, పీరుసాహెబ్ పేట మున్సిపాలిటీలోని కుద్దిరాం తదితర గ్రామాల్లో రైతన్న మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో రాగోలు పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు మధుకుమార్, ఉదయ్‌బాబు, మండల వ్యవసాయాధికారి మెట్ట మోహనరావు, కొర్లకోట సర్పంచ్ ప్రతినిధి సనపల అప్పలనాయుడు, ఎంపిటిసి అన్నెపు భాస్కరరావు, మార్కెట్ కమిటీ సూపర్‌వైజర్ జయమ్మ, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బూర్జ: రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎఒ ఉషారాణి

ఆమదాలవలస : ప్రభుత్వ కార్యక్రమాలను వివరిస్తున్న భాగ్యలక్ష్మి

పలాస : వివరాలు సేకరిస్తున్న ఆర్‌డిఒ వెంకటేష్

లావేరు: రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర టిడిపి మహిళా కార్యదర్శి ముప్పిడి సుజాత అన్నారు. మండలం తాళ్లవలస పంచాయతీలో సోమవారం నిర్వహించిన రైతన్న సేవలో మన మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాస్, ఎంపిడిఒ వెంకట రాజు, మాజీ సర్పంచ్ ముప్పిడి మురళీమోహన్, దారాపురెడ్డి కూర్మారావు, మాజీ ఎంపిపి డొకల తవిటమ్మ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బూర్జ: మండలంలోని ఓవిపేటలో మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతన్న మీకోసం కార్యక్రమం నిర్వహించారు. పలు కార్యక్రమాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి డి.ఉషారాణి, వైస్ ఎంపిపి బుడుమూరు సూర్యారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పొందూరు: మండలంలోని పిల్లలవలసలో సర్పంచ్ బుడుమూరు పోలినాయుడు ఆధ్వర్యంలో రైతన్న మీకోసం కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయశాఖ జిల్లా సంయుక్త సంచాలకులు ఎస్.వై.వి.ఎస్ మోహనరావు రైతుల నుంచి సమస్యలపై వినతులను స్వీకరించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఎడి శ్రీనివాసరావు, ఎఇఒ ప్రవీణ్, నాయకులు పాల్గొన్నారు.

అభినందిస్తున్న రామ్మోహన్ నాయుడు

శంకర్‌రెడ్డికి అభినందనలు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ కొండ శంకర్‌రెడ్డిని కేంద్రమంత్రి కె.రామ్మోహన్ నాయుడు అభినందించారు. కేంద్రమంత్రి క్యాంప్ కార్యాలయంలో సోమవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆప్యాయంగా పలకరించి అభివృద్ధికి కృషి చేయాలన్నారు.

చెక్కును అందజేస్తున్న నాయకులు

రూ.లక్ష చెక్కు అందజేత

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

పలాస వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఇటీవల జరిగిన తొక్కిసలాటలో టెక్కలి మండలం తెలినీలాపురానికి చెందిన ఆర్.రామలక్ష్మి గాయపడింది. ఈ మేరకు సోమవారం ప్రభుత్వం నుంచి వచ్చిన రూ.లక్ష చెక్కును టిడిపి, జనసేన నాయకులు బాధితురాలికి సోమవారం అందజేశారు. కార్యక్రమంలో కోటబొమ్మాళి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బగాది శేషగిరిరావు, టెక్కలిజనసేన ఇన్‌ఛార్జి కణితి కిరణ్, దల్లి ప్రసాద్‌రెడ్డి, ఇప్పిలి జగదీశ్వరరావు, మామిడి రాము తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం చేస్తున్న సభ్యులు

సంతపేటలో అన్నదానం

ప్రజాశక్తి- నరసన్నపేట

నిరుపేదలకు, అనాథలకు, ఎటువంటి సంరక్షణ లేనివారికి నరసన్నపేట లయన్స్ క్లబ్ ఆధ్వర్యాన సంతపేట ఆవరణలో సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సంతలో వివిధ రకాల వస్తువులు అమ్మినవారికి అన్నం పార్సిల్ పొట్లాలు అందచేసి ఆకలి తీర్చారు. వారంతా ఆనందం వ్యక్తం చేసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ గొలివి మోహన్, రమేష్, బాలకృష్ణ, లయన్స్‌క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

ప్రజాశక్తి- లావేరు

మండలంలోని లోపెంట గ్రామానికి చెందిన కర్ణపు సన్యాసిరావు అనే వృద్ధుడు అదృశ్యమైనట్లు ఆయన కుటుంబ సభ్యులు జీరు సన్యాసిరావు ఫిర్యాదు మేరకు లావేరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు సన్యాసిరావు వ్యవసాయం, ఇటుకుల తయారీ పనులు చేస్తూ ఉంటాడు. ఈ నెల 8న లోపెంట గ్రామం నుంచి విశాఖపట్నంలోని లంకెలపాలెం వెళ్లి వస్తానని చెప్పి ఇంటినుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో అక్కడ లేకపోవడంతో తమ బంధువులు ఉన్న గ్రామాల్లో వెతకగా ఆచూకీ లభ్యం కాకపోవడంతో ఆయన బంధువు జీరు సన్యాసిరావు ఫిర్యాదు మేరకు సోమవారం లావేరు ఎస్ఐ కొండపల్లి అప్పలసూరి కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కానిస్టేబుల్ చక్రధర్ తెలిపారు.

ప్రతిభా పరీక్షకు స్పందన

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మండలంలోని కంబాలరాయుడుపేట మండల పరిషత్ ప్రాథమిక మోడల్ పాఠశాలలో సోమవారం నిర్వహించిన ప్రతిభ పరీక్షకు స్పందన లభించింది. మాతృభూమి అభివృద్ధి సంఘాల సమాఖ్య సౌజన్యంతో ప్రధానోపాధ్యాయుడు లభినాన కరుణాకర్ ఆధ్వర్యాన ప్రతిభా పరీక్షలు నిర్వహించారు. మండలంలోని 41 ప్రాథమిక పాఠశాలల నుంచి 164 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు వరుసగా మంచినీళ్లపేట, కంబాలరాయుడుపేట, పెద్దమురహరిపురం ప్రాథమిక పాఠశాలల విద్యార్థులు కైవసం చేసుకున్నారు. వీరికి మండల విద్యాశాఖ అధికారి వెంకటరమణ షీల్డ్‌లతో పాటు నగదు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వంక చిరంజీవి, ఎంపిటిసి కారి వెంకటరావు, మాజీ సర్పంచ్ కంబాల దినేష్ పాల్గొన్నారు.

ప్రతిభా పరీక్షలో పాల్గొన్న విద్యార్థులు

క్రీడాకారులతో ఎమ్మెల్యే రమణమూర్తి

క్రీడలతో మానసికోల్లాసం

ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

ప్రజాశక్తి- పోలాకి

క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మండలంలోని ఈదులవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి గ్రిగ్స్ ఆటల పోటీలను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉండాలంటే ఆడుతూ పాడుతూ చదువుతూ దేహదారుఢ్యం, మానసిక వికాసం చాలా అవసరమని తెలిపారు. అదే మానసిక వికాసం రావాలంటే క్రీడలు ఒక ఔషధమని పేర్కొన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, కళింగ కార్పొరేషన్ చైర్మన్ రోణంకి కృష్ణన్నాయుడు, టిడిపి మండల అధ్యక్షులు మిరియాపల్లి వెంకటప్పలనాయుడు, పిఎసిఎస్ చైర్మన్ బైరి భాస్కరరావు, సర్పంచ్‌లు తర్ర లక్ష్మీనారాయణ, చిట్టి సింహాచలం, తహశీల్దార్ శ్రీనివాసరావు, ఎంపిడిఒ రవికుమార్, ఎస్ఐ రంజిత్, ఎంఇఒ, ప్రధానోపాధ్యాయులు, పిఇటిలు పాల్గొన్నారు.

అభ్యాసన సామర్థ్యాలు మెరుగుపడాలి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

అభ్యాసన సామర్థ్యాలు మెరుగుపడాలని ఎంఇఒలు కె.అప్పారావు, ఎస్.విశ్వనాథం అన్నారు. మున్సిపాలిటీలోని ముత్యాలమ్మపేట ప్రాథమిక పాఠశాల, మండలంలోని ప్రాథమిక పాఠశాల విద్యావార్షిక తనిఖీలు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల లిస్సనింగ్, స్పీకింగ్, రైటింగ్ రీడింగ్ స్కిల్స్ పెరగాలన్నారు. ప్రతి విద్యార్థీ ధారాళంగా చదవడం, రాయడం, గణితంలో చతుర్విధ ప్రక్రియలపై సమగ్ర అవగాహన కల్పించాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనం నిర్వహణ తీరును పరిశీలించి విద్యార్థులతో పాటు భోజనం రుచి చూశారు. కార్యక్రమంలో సిఆర్ఎంటిలు ఆర్.దేవవరాజు, కె.సోమేశ్వరరావు, సత్యనారాయణ, మోహనరావు, బి.గణేష్, ప్రధానోపాధ్యాయులు మిత్తన నిమ్మయ్య, డబ్బురి ధనలక్ష్మీబాయి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంఇఒలు

బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

విద్యతోనే అభివృద్ధి సాధ్యం

ప్రజాశక్తి- కవిటి

విద్యతోనే అభివృద్ధి సాధ్యమని, విద్యార్థులకు ప్రోత్సాహం తప్పనిసరని పి.కె.పాలెం గ్రామ యువకులు అన్నారు. మండలంలోని పి.కె.పాలెం జెడ్‌పిహెచ్ఎస్ విద్యార్థులకు గ్రామ యువకులు వక్తృత్వం, వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రత్యేకంగా బహుమతులను అందజేస్తూ వారిని ప్రోత్సహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ఎం.మురళీప్రకాష్ మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో సృజనాత్మకతను, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని అన్నారు. ఉపాధ్యాయులు పాపారావు, దుర్యోధన, కరి లింగరాజు పోటీల నిర్వహణలో సహకరించారు. కార్యక్రమంలో గ్రామ యువకులు దేవరాజు, ప్రకాష్, జోగారావు, జగ్గారావు, నారాయణ, రాకేష్ విద్యార్థులను అభినందించారు.

మేము సైతం...

ప్రజాశక్తి- కవిటి

అకాల మృతి చెందిన మండలంలోని గొండ్యాలపుట్టుగకు చెందిన రమేష్ కుటుంబానికి దాతలు అండగా నిలుస్తున్నారు. రమేష్ కుటుంబ దయనీయ స్థితి వివరిస్తూ 'ప్రజాశక్తి' ఈ నెల 14న 'మావయ్య.. నాన్నేరి' అనే కథనం ప్రచురించింది. దీంతో ఆపద సమయంలో మేము సైతం అంటూ పలు స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు రమేష్ కుటుంబానికి తమకు తోచిన సాయం అందిస్తున్నాయి. అందులో భాగంగానే కవిటి సినిమా హాల్ రోడ్డులో ఉన్న విఘ్నేశ్వర సేవా సంఘం సభ్యులు సోమవారం రమేష్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. తమ వంతుగా రూ.15,051లు అందించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, విఘ్నేశ్వర సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

నగదు అందిస్తున్న సభ్యులు

'అగ్నివీర్'కు అన్నదమ్ములు ఎంపిక

ప్రజాశక్తి- పొందూరు

శివకుమార్, దుర్గాప్రసాద్

కేంద్ర ప్రభుత్వం డిఫెన్స్ రంగంలో చేరేందుకు తీసుకొచ్చిన అగ్నివీర్ ఉద్యోగాలకు మండలంలోని లైదాంకు చెందిన ఒకే కుటుంబంలో ఇద్దరు అన్నదమ్ములు ఎంపికయ్యారు. గ్రామానికి చెందిన దుర్గాసి శివకుమార్, దుర్గాసి దుర్గాప్రసాద్ ఎంపిక కావడంపై సర్పంచ్ అనంతరామకృష్ణ గ్రామస్తులు, కుటుంబసభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

చిత్రపటం అందజేస్తున్న ఆలయాధికారులు

అన్నదానానికి విరాళం

అరసవల్లి : అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదానానికి శ్రీకాకుళానికి చెందిన మాన్విక క్రిష్ణై రూ.లక్ష విరాళం అందజేశారు. దీనికి సంబంధించిన చెక్కును ఆలయ కార్యనిర్వాహణాధికారి కె.ఎన్.వి.డి.వి.ప్రసాద్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వారికి ఆలయ అర్చకులు చిత్రపటాన్ని బహూకరించారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

6న అశ్రా జాతీయ సదస్సు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

జాతీయ అశ్రా సదస్సు డిసెంబర్ 6న విజయవాడలో నిర్వహించనున్నట్లు ప్రతినిధులు సోమవారం తెలిపారు. ఈ మేరకు కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఆముదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌లను కలిసి సమావేశ పోస్టర్‌ను ఆవిష్కరించినట్లు చెప్పారు. అందుకు సంబంధించిన ఆహ్వానపత్రాలు, పోస్టర్లు అందజేశామన్నారు. వినియోగదారుల హక్కులు, విధులపై ప్రచారం లక్ష్యమన్నారు. వినియోగదారుల హక్కులపై ప్రతిఒక్కరికీ అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. ప్రజల్లో చైతన్యంతోనే మెరుగైన సేవలు వినియోగదారులకు అందుతాయని అన్నారు. కార్యక్రమంలో అశ్రా జిల్లా చైర్మన్ డాక్టర్ గంజి ఎజ్రా, కమిటీ సభ్యులు రాంబాబు, సారథి బాలకృష్ణ, జాప్ జిల్లా అధ్యక్షులు జి.షణ్ముఖ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి ఆర్థికసాయం

కవిటి: కవిటిలో దాతల సహా యంతో నూతనంగా నిర్మిస్తున్న వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి ఈదుపు రానికి చెందిన ఉపాధ్యాయులు నర్తు గంగయ్య రూ.10 వేలు, కవిటికి చెందిన విశ్రాంత సైనికుడు రూ.5వేలు, ఉపాధ్యాయుడు బెందాళం వెంకటరావు రూ.5 వేలు సోమవారం అందించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు బిపి రెడ్డి, మొగిలిపురి సీతారాం, ఆరింగి మధు, పాండవ చంద్రశేఖర్, పొల్లాయి రుద్రయ్య తదితరులు మాట్లాడారు.

నిర్మాణంలో ఉన్న ఆలయం